సాక్షి వరంగల్

శుక్రవారం । 13 । జనవరి । 2023



పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

విద్యుత్ సంస్థలో వేతన సవరణను వెంటనే చేపట్టాలని తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం టీఎస్ డిస్కం అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. - IIలో▸



గోవులకు సేవ చేయడం అదృష్టం

గోవులకు సేవచేసే అవకాశం లభించడం గోపాలమిత్రల అదృష్టమని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రావు అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
31.0⁰ /17.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యరశ్మితో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు పాడి పశువుల అందాల పోటీలు

నర్సంపేట: శాంతిసేన రైతు సంఘం ఆధ్వర్యంలో పాడి పశువుల అందాల పోటీలను పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఈనెల14న ఉదయం 10గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాడి పశువుల అందాల పోటీల వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చిలువేరు కుమారస్వామి మాట్లాడుతూ పాడి పశువుల అందాల పోటీలకు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పోటీల్లో గెలు పొందిన వారికే కాకుండా నర్సంపేట, కొత్తగూడ, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం, గూడూరు మండలాలకు చెందిన రైతులకు రవాణా చార్జీ లు రూ.600 చొప్పున చెల్లిస్తామన్నారు. పోటీల్లో జోడెడ్లు, ఆవు, గేదె, గొర్రెపోతు, మేకపోతు, కుక్క, దూడ, కోడిపుంజులను కూడా ప్రదర్శించవచ్చని తెలిపా రు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి తౌటి వెంకటనారాయణ, డైరెక్టర్ చిలువేరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు సిద్ధం కావాలి

గీసుకొండ: ఈనెల 18 నుంచి చేపట్టే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి సిద్ధం కావాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో కంటి వెలుగుపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ చల్లా మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్, డీపీహెచ్ఎన్ జ్ఞానసుందరి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, డాక్టర్ ప్రతాపగిరి ప్రసాద్, డీపీఓ అర్చన, డీడీఎం నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మార్కెట్‌కు సెలవులు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 14 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. 14న భోగి, వారాంతపు యార్డు సెలవు, 15న ఆదివారం, మకర సంక్రాంతి, 16న కనుమ పండుగ సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. 17న పునఃప్రారంభమవుతుందని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

20 నుంచి స్టడీ మెటీరియల్ పంపిణీ

వరంగల్ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయడానికి ఈనెల 20వ తేదీ నుంచి స్టడీ మెటీరియల్, స్పెషల్ మెనూ కింద రూ.20 చొప్పున ప్రతీ విద్యార్థికి అందించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ జహీరుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు స్పెషల్ డ్రైవ్ కింద మోటివేషన్(ప్రేరణ) తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే దళిత అభివృద్ధి శాఖలోని వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్, స్పెషల్ మెనూ, ట్యూటర్ల చేత ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మైనార్టీ రుణాలకు 6,052 దరఖాస్తులు

వరంగల్ రూరల్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు 74 యూనిట్లు లక్ష్యం కాగా.. 6,052 దరఖాస్తులు వచ్చాయని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కె.విక్రమ్‌కుమార్ గురువారం తెలిపారు. మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం దరఖాస్తులు పరిశీలనలోఉన్నాయని పేర్కొన్నారు.

ప్రతిపక్షాలను ఎండగడుతూ.. అభివృద్ధిని వివరిస్తూ..



మహబూబాబాద్ కొత్త కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం కేసీఆర్, సీఎస్ శాంతికుమారి గ్రూప్ ఫొటో



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్



కలెక్టరేట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులు



కలెక్టరేట్ వద్ద సీఎంకు నమస్కరిస్తున్న సీఎస్ శాంతికుమారి, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్



కలెక్టర్ శశాంకను అభినందిస్తున్న సీఎస్, పక్కన సీఎం, మంత్రి

ఉత్సాహంగా సాగిన సీఎం కేసీఆర్ మానుకోట పర్యటన


- ఎనిమిదేళ్ల నాటి పరిస్థితులు.. నేటి సంక్షేమ రోజులను వివరిస్తూ..
- కురవి వీరన్నకు మొక్కి ఉద్యమం చేశానంటూ జ్ఞాపకాల ప్రస్తావన
- బతుకమ్మలతో స్వాగతం పలికిన మహిళలు
- కార్యక్రమం విజయవంతంతో నాయకుల్లో నూతనోత్సాహం

సీఎం వరాలు

- మహబూబాబాద్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు.. వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి..
- జిల్లాలో పాతవి 461.. 283 కొత్త పంచాయతీలు ఉండగా, ఒక్కో పంచాయతీకి రూ.10లక్షల చొప్పున నిధులు
- మహబూబాబాద్ పట్టణంలో అసంపూర్తి పనులను తక్షణమే పూర్తి చేసేందుకు రూ.50కోట్లు మంజూరు చేశారు.
- తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీలకు ఒక్కో దానికి రూ.25కోట్లు

కురవి వీరన్నస్వామి దయ. మానుకోట రాళ్ల బలం. ప్రజల ఆకాంక్ష నెరవేరి మనకు ప్రత్యేక రాష్ట్రం లభించింది. కొందరు వద్దన్నా.. మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి ప్రాంతాల అభివృద్ధిని ఆకాంక్షించి నేను పట్టుబట్టి జిల్లాలుగా ఏర్పాటు చేశా. ఇప్పుడు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. సంతోషంగా ఉంది. మహబూబాబాద్ వచ్చి నూకల రాంచంద్రారెడ్డిని స్మరించకుండా ఉండలేం. ఆ మహనీయుడి గురించి నేటితరానికి తెలిపేందుకు మహబూబాబాద్, వరంగల్ పట్టణాల్లో ప్రభుత్వ ఖర్చులతో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఒక ఇనిస్టిట్యూట్‌కు పేరు పెడతాం.

- మానుకోటలో సీఎం కేసీఆర్



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్/అర్బన్: ఎనిమిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు చేరువైన పాలన.. వివరిస్తూనే.. మరోవైపు ప్రతిపక్ష పార్టీలకు చురకలంటించడం. ముఖ్యంగా మతతత్వం పెంచుతోందని బీజేపీ వైఖరిని ఎండగడుతూ.. దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ పాత్రను వివరిస్తూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం ఉత్సాహంగా సాగింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం, జిల్లా గ్రంథాలయాన్ని సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించారు. ముందుగా సీఎంకు డీఆర్డీఏ, సెర్ప్, ఐకేపీ, మహాలక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు హెలిపాడ్ వద్ద మంత్రి సత్యవతి, ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. మధ్యాహ్నం 12.14 గంటలకు మహబూబాబాద్ జిల్లాకు వచ్చిన సీఎం.. పర్యటనను ముగించుకుని మధ్యాహ్నం 2.56 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం బయల్దేరి వెళ్లారు. అంతకుముందు కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సీఎం కేసీఆర్ తెలంగాణ మాదిరిగానే దేశం కూడా అభివృద్ధి సాధించకపోవడానికి బీజేపీ ఎలా కుట్ర చేస్తుంది.. కులం, మతం పేరుతో ఆ పార్టీ విద్వేషాలను రెచ్చగొడుతోందని చెబుతూనే.. దేశానికి శాంతి మంత్రం కావాలని వివరించారు. అన్ని విషయాలు పూసగుచ్చినట్లు చెబుతూనే.. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో ఈ విషయంపై రచ్చబండ చర్చ పెట్టాలని పిలుపునిచ్చారు.

మానుకోట గడ్డకు వందనం

ఎందరో మహానుభావులు పుట్టిన గడ్డ మానుకోట అని, వెనుకబడిన ప్రాంతమైన దీని అభివృద్ధికి ప్రత్యేక నిధులు సైతం ప్రకటించారు. తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలోని తొర్రూరు, పాలకుర్తి, వర్ధన్నపేట ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి కష్టాల గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తీరిన కష్టాల గురించి సీఎం సవివరంగా చెప్పారు. అదేవిధంగా జిల్లాలోని ముఖ్య నాయకులు నూకల రాంచంద్రారెడ్డి తెలంగాణ కోసం చేసిన ప్రయత్నం చెప్పి.. ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. కురవి వీరభద్రుడిని మొక్కి తెలంగాణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశామని, కోర మీసం చేయించి వీరభద్రుడి మొక్కులు తీర్చుకున్నానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గిరిజనులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్న మహబూబాబాద్‌ను కొందరు వద్దన్నా జిల్లాగా మార్చానని చెబుతూ.. గతంలో చూసిన మానుకోటకు ఇప్పటి మానుకోటకు ఎంతో మార్పు వచ్చిందని సీఎం చెప్పారు. ఇంకా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

జిల్లా అభివృద్ధిపై సీఎం సంతృప్తి

సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధిపై తన ప్రసంగంలో సంతృప్తి వ్యక్తం చేశారు. మానుకోట ముఖచిత్రం మారిందని మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డిని అభినందించారు. కొన్ని అసంపూర్తి కాల్వలు, రోడ్లున్నాయని, వాటిని కూడా పూర్తి చేయాలన్నారు. తాను మంజూరు చేసిన నిధులను కలెక్టర్ కె.శశాంక, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు మాట్లాడుకుని సక్రమంగా ఖర్చు చేయడంతోపాటు ప్రతీ పైసా ప్రజలకు ఉపయోగపడాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, సీఎం ఓఎస్డీ స్మితా సబర్వాల్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, ఎంపీలు మాలోతు కవిత, పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యానాయక్, హరిప్రియ, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బందోబస్తు పర్యవేక్షించిన ఎస్పీ

సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును ఎస్పీ శరత్‌చంద్ర పవార్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

పూజలు.. అభినందనలు

కలెక్టరేట్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభం అనంతరం ఆయాచోట్ల ప్రత్యేక పూజలు చేశారు. సర్వమత ప్రార్థనలు జరిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకను సీఎం కేసీఆర్ స్వయంగా ఆయన చాంబర్‌లోని కుర్చీలో కూర్చోబెట్టారు. పాలన పకడ్బందీగా చేయాలని ఆకాంక్షిస్తూ దీవించారు. కలెక్టర్ శశాంక కూడా సీఎం కేసీఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. అదేవిధంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవితను కుర్చీలో కూర్చోబెట్టి ఆశీర్వదించారు.

సీఎం పర్యటన హైలెట్స్

- 12.14: తాళ్లపూసపల్లి రోడ్డులో హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది
- 12.16: సీఎం కేసీఆర్‌కు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం
- 12.18: రోడ్డు మార్గంలో బీఆర్ఎస్ కార్యాలయానికి బయల్దేరారు
- 12.22: బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్నారు
- 12.29: పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు
- 12.30: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితతో సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు
- 12.50: తిరిగి బస్సు ఎక్కి రోడ్డు మార్గంలో జిల్లా సమీకృత కార్యాలయానికి చేరుకున్నారు
- 12.52: పోలీసుల స్వాగతం, గౌరవ వందనం స్వీకరించారు
- 12.58: జిల్లా నూతన సమీకృత కార్యాలయాన్ని ప్రారంభించారు
- 12.59: నుంచి 1.20 మధ్య కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కలెక్టర్‌ను కుర్చీలో కూర్చోబెట్టారు
- 01.28: సభా వేదికపైకి చేరుకున్నారు
- 01.44: సభలో ప్రసంగం ప్రారంభించారు
- 02.02: ప్రసంగం ముగించారు
- 02.04: భోజనం చేశారు
- 02.48: గంటలకు సీఎం కేసీఆర్ హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు
- 02.56: మహబూబాబాద్ నుంచి సీఎం కేసీఆర్ భద్రాద్రి కొత్తగూడెం బయల్దేరి వెళ్లారు.



వద్దన్నా నీళ్లిస్తున్న మహనీయుడు సీఎం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

గిరిజనుల ఆత్మబంధువు కేసీఆర్

రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



- వివరాలు IIలో▸

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

పర్వతగిరి: దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానందుడని, ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని లయోలా స్కూల్‌లో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి దయాకర్‌రావు హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీవల్లి, ధనరాజ్, గోపిదాస్, సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ జనార్దన్‌గౌడ్, స్వామి, దొనగాని సదానందం, రామకృష్ణ సేవా సమితి సభ్యులు చిదురాళ్ల శేఖర్, వేణు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సమస్యల 'మార్కెట్'

రూ.5కోట్ల ఆదాయం దాటినా.. కనీస సౌకర్యాలు కరువు

- మూడేళ్లుగా భర్తీకాని నర్సంపేట మార్కెట్ చైర్మన్ పదవి
- ఖాళీ పోస్టులతోనే నెట్టుకొస్తున్న వైనం
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సంపేట: సెలక్షన్ గ్రేడ్ మార్కెట్.. ఏనుమాముల మార్కెట్ తర్వాత ఆదాయంలో ఏడాదికి రూ.5కోట్లు ఆర్జిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన నర్సంపేట వ్యవసాయ మార్కెట్ సమస్యలతో సతమతమవుతోంది. మూడేళ్లుగా మార్కెట్ చైర్మన్ పదవి ఖాళీగా ఉండటం.. ఖాళీ పోస్టుల్లో సిబ్బందిని భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది. రైతుల విశ్రాంతి భవనాన్ని ఇతర అవసరాలకు వినియోగించడం.. డ్రెయినేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. నిత్యం పత్తి, ధాన్యం, మొక్కజొన్నలతోపాటు ఇతర పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వందలాది మంది రైతులు వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వస్తారు. సరుకు ఎక్కువగా వచ్చినప్పుడు పాట ఆలస్యం కావడం వల్ల సాయంత్రం వరకు ఇక్కడే ఉండాల్సి వస్తోంది. దీంతో విశ్రాంతి తీసుకోవాలన్నా.. వీలులేని పరిస్థితి ఉంది. కనీసం మరుగుదొడ్లు వినియోగించుకోవాలన్నా.. నిత్యం తాళం వేసి ఉండటంతో అవస్థలు పడుతున్నారు.

మూడేళ్లుగా చైర్మన్ పదవి ఖాళీ..

నర్సంపేట మార్కెట్ చైర్మన్ పదవి 2019 నుంచి ఖాళీగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ప్రకటించగా.. ఈ మార్కెట్ బీసీ జనరల్‌కు రిజర్వ్ అయింది. అప్పట్లో బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఏడాది కాలంపాటు చైర్మన్ బాధ్యతలు నిర్వహించిన తర్వాత తిరిగి భర్తీ చేయలేదు. దీంతో మార్కెట్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో బాధ్యత తీసుకునే వారే కరువయ్యారు. అరకొరగా ఉన్న సిబ్బంది ఎక్కువ సమయం విధులు నిర్వహించడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారులు కూడా మార్కెట్‌లోని సమస్యలను పట్టించుకోవడంలోగానీ, సమస్యలను పరిష్కరించడంలోగానీ చొరవ చూపడం లేదు.

ప్రధాన పోస్టులన్నీ ఖాళీ..

మార్కెట్‌లో 14 మంది సిబ్బందికి.. సెక్రటరీతోపాటు మరో ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. భర్తీ చేయాల్సిన పోస్టుల్లో సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎంఎస్‌లు, ఒక గ్రేడర్, టైపిస్ట్, నలుగురు వాచ్‌మెన్లు, ఒక అటెండర్ పోస్టు భర్తీ కాలేదు. ఆదాయపరంగా నంబర్ వన్ స్థానంలో ఉన్న మార్కెట్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల వల్ల పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఇప్పటికైనా మార్కెట్ చైర్మన్ పదవితోపాటు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి.. సదుపాయాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆదాయంలో అగ్రస్థానంలో..

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో ఆదాయపరంగా ఏనుమాముల మార్కెట్ తర్వాత నర్సంపేట మార్కెట్ నిలిచింది. 2019–20లో రూ.4.15కోట్ల ఆదాయం రాగా.. 2020–21లో రూ.4.42కోట్లు, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.5.29కోట్ల ఆదాయం సమకూరింది. 2007లో స్పెషల్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మార్కెట్‌గా అప్‌గ్రేడ్ కావడంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భారీ స్థాయిలో గోదాంల నిర్మాణం జరిగింది. దీంతో వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు పొంది వ్యాపారాలు నిర్వహించడంతో మార్కెట్‌కు అదేస్థాయిలో ఆదాయం పెరుగుతూ వస్తోంది. ఏటా ఆదాయం పెరుగుతూ వస్తున్నా నర్సంపేట మార్కెట్‌పై పాలకులతోపాటు అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.



విశ్రాంతి గది కేటాయించాలి..



వ్యవసాయ మార్కెట్‌లో మరుగుదొడ్లతోపాటు విశ్రాంతి తీసుకోవడానికి గదిని కేటాయించాలి. ఉద్యోగులు సరిపోను లేకపోవడం వల్ల అసౌకర్యంగా ఉంది. గోదాంల పరంగా అభివృద్ధి జరిగినప్పటికి రైతుల సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు.

- కిషన్‌నాయక్, నల్లబెల్లి

మార్చి 30లోగా పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ గోపి

కరీమాబాద్: పాఠశాలల దిశ, దశ మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు–మన బడి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ గోపి అన్నారు. పనుల పురోగతిపై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినట్లయితే గడువులోగా పనులు కచ్చితంగా పూర్తవుతాయన్నారు. జిల్లా ప్రత్యేకాధికారులు, ఎంఈఓలు, హెడ్మాస్టర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు ప్రతీ ఒక్కరు పనులు నాణ్యతతో, సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. మార్చి 30వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నల్లబెల్లి, పర్వతగిరి మండలాల్లో మాత్రమే 100 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, డీఈఓ వాసంతి, డీఆర్డీఓ సంపత్‌రావు,ఎంఈఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి : వీసీలో మంత్రి హరీశ్‌రావు

కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటి వైద్య శిబిరాలలో ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఆర్పీలు, వీఏఓలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోపి మాట్లాడుతూ ఇప్పటికే గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించామని చెప్పారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్యాధికారి కె.వెంకటరమణ, డీపీఓ కల్పన తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

క్లుప్తంగా

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

హన్మకొండ: విద్యుత్ సంస్థలో వేతన సవరణను వెంటనే చేపట్టాలని తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం టీఎస్ డిస్కం అధ్యక్షుడు ఆరెపల్లి శ్రీనివాస్, కార్యదర్శి బక్క దానయ్య డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ గెస్ట్ హౌస్‌లో సంఘం కంపెనీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. డిస్కం ఉపాధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పేరుకుపోయిన అనేక సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు పి.రామస్వామి, స్వదేశ్‌కుమార్, చలపతి, వి.కృష్ణ, విజయ్ కుమార్, వెంకన్న, సుధాకర్, వెంకటేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కేసు రాజీ చేసుకో.. లేదంటే చంపేస్తాం

- వృద్ధుడికి కొడుకు, కోడలు వేధింపులు

నల్లబెల్లి: కొడుకు, కోడలు వేధింపులు తాళలేక నాలుగేళ్ల క్రితం మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. సాక్షాధారాలు బలంగా ఉండడంతో కేసు రాజీ కుదుర్చుకోవాలని, లేదంటే చంపేస్తామని కొడుకు, కోడలు వృద్ధుడిపై వేధింపులకు దిగారు. దీంతో బాధితుడు గురువారం పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన కందకట్ల సరోజన–సమ్మయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. వివాహాలు జరిపించి మూడెకరాల చొప్పున ఇద్దరికి పంచి ఇచ్చారు. తమ పోషణ కోసం ఎకరం 10 గుంటలు ఉంచుకున్నారు. నాలుగేళ్ల క్రితం సరోజన, సమ్మయ్యను కొడుకు కర్ణాకర్, కోడలు రమ చిత్రహింసలకు గురిచేశారు. దీంతో కర్ణాకర్ తల్లి సరోజన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కన్న కొడుకు వేధింపులతోనే తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని సమ్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కర్ణాకర్‌పై కేసు నమోదు చేశారు. దీంతో కొడుకు, కోడలు సమ్మయ్యపై మరింత ద్వేషం పెంచుకున్నారు. సాక్షాధారాలు బలంగా ఉండడంతో కేసు రాజీ కుదుర్చుకోవాలని కర్ణాకర్‌కు పలువురు సూచించారు. దీంతో కొంతకాలంగా తనపై ఉన్న కేసు రాజీకి అంగీకరించాలని సమ్మయ్యను మరింత వేధిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఇరుగుపొరుగు వారు వృద్ధుడికి సహకరిస్తే దూషిస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం సమ్మయ్య ఇంటికి తాళం వేసుకుని బంధువుల ఇంటి వెళ్లాడు. ఆగ్రహంతో కుమారుడు ఇంటిని ధ్వంసం చేశాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నార్లాపురం రాజారాం తెలిపారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు





సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

వద్దన్నా నీళ్లిస్తున్న మహనీయుడు సీఎం కేసీఆర్

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి, మహబూబాబాద్: 'ముప్పై సంవత్సరాల క్రితం తవ్విన శ్రీరాం సాగర్ కాల్వల్లో తుమ్మలు మొలిచాయి. అప్పటి సీఎం కాల్వలను ప్రారంభించినరోజు మాత్రమే నీళ్లు వచ్చాయి. ఇప్పుడు మనకు వద్దన్నా.. నీళ్లు ఇస్తున్న మహనీయుడు కేసీఆర్' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, జిల్లా గ్రంథాలయం, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాలను సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభించారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రారంభం తరువాత కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి ప్రసంగించారు. సాగు, తాగునీటికి కష్టపడిన ప్రజల కలలు నిజం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. గ్రామాలకు జిల్లా కేంద్రాలు దూరంగా ఉండటంతో కలెక్టర్ కార్యాలయానికి సద్దులు కట్టుకొని పోయేవారని.. ఇప్పుడు మన వద్దకే అధికారులు, సంక్షేమ పథకాలు వచ్చాయని తెలిపారు. పేదలు పెద్ద వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు జిల్లా కేంద్రంలోనే మెడికల్ కళాశాల, పెద్ద డాక్టర్లతో వైద్యం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాల ఏర్పాటుతోపాటు పండుగ వాతావరణంలో ప్రారంభించుకోవడం చూస్తుంటే మన ఇంటికి తల్లిదండ్రులు వచ్చినంత సంబురంగా ఉందని అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

గిరిజనుల ఆత్మబంధువు సీఎం : రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్

అనేక పథకాలతో గిరిజన, ఆదివాసీ బిడ్డల కళ్లల్లో ఆనందం నింపిన ఆత్మబంధువు సీఎం కేసీఆర్ అని రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మారుమూల జిల్లా అభివృద్ధికి వరాలు కురిపించిన కేసీఆర్ రాకకోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నామని, కల నిజమైన రోజుగా మంత్రి అభివర్ణించారు. డివిజన్ కేంద్రంగా ఉన్న మానుకోటను బంగారు కోటగా మార్చారని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలవాలంటే ఇబ్బందులు పడేవారని, ఇబ్బందులను తొలగించిన కేసీఆర్ గిరిజన బిడ్డల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. రైల్వే ట్రాక్, అపారమైన ఖనిజ సంపద, నదులు ప్రవహించే జిల్లాలో కరువు, ఇబ్బందులు ఉండేవని, ఎనిమిది సంవత్సరాల్లో చేసిన మార్పు కళ్లకు కట్టినట్లు కన్పిస్తుందన్నారు. తుమ్మలు మొలిచి, పూడిపోయిన ఎస్సారెస్పీ కాల్వల్లో మళ్లీ జలకల సంతరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. నిండు ఎండ కాలంలో కూడా చెరువులు మత్తడి దూకడం చూస్తే ఇంతకన్నా ఆనందం ఏముందని అన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో డెబ్బై సంవత్సరాలు అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన బిడ్డలకు కేసీఆర్ పాలనలో వెలుగులు నింపారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూలన వేసిన గిరిజన రిజర్వేషన్లను 6 నుంచి 10శాతం పెంచిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. కేసీఆర్ సుపరిపాలనలో తనను భాగస్వామ్యం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు కేసీఆర్ వెంటే అని స్పష్టం చేశారు.



సీఎం కేసీఆర్‌తో ముచ్చటిస్తున్న మంత్రి సత్యవతి



శిలాఫలకం ఆవిష్కరించి జిల్లా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్



సీఎంకు చిత్రపటం బహూకరిస్తూ..



సీఎం కేసీఆర్ కాన్వాయ్

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవితను కుర్చీలో కూర్చోబెట్టిన సీఎం కేసీఆర్

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారులో నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయ భవనాన్ని గురువారం సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు మాలోత్ కవిత, పసునూరి దయాకర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రావు, కడియం శ్రీహరి, బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, బానోత్ శంకర్ నాయక్, హరిప్రియ, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, టి.రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎన్.నరేందర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్లు ఎ.బిందు, జి.జ్యోతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.నవీన్‌రావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, ఎం.వెంకన్న, పి.శ్రీనివాస్‌రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తూ..

నిరసన గళం



సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లాకు రూ.5 వేల కోట్లు కేటాయించాలని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలని సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా గురువారం ర్యాలీగా వస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులను అంబేడ్కర్ సెంటర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. ఇందులో నాయకులు భూతం వీరయ్య తదితరులున్నారు. సీఐ వెంకటరత్నం, ఎస్సై అరుణ్‌కుమార్ నిరసనకారులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



చల్లా గోవర్ధన్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

- గిరిజనేతరులకు పట్టాలివ్వాలంటూ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ సమీపంలో నూతన కలెక్టరేట్‌కు బయల్దేరిన సీఎం కాన్వాయ్‌కు అడ్డుకునేందుకు బీసీ జనసభ జిల్లా అధ్యక్షుడు చల్లా గోవర్ధన్ యత్నించారు. పోలీసులు గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు.
- మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన పలువురు యువకులు తమ ప్రాంతంలో వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ప్లకార్డులతో సీఎం సభ ఆవరణలో నిరసన తెలిపారు. సీఐ సతీశ్, ఎస్సై జగదీశ్ వారిని వారించి పక్కకు పంపించారు.

సందడే.. సందడి



మానుకోట అభివృద్ధిపై ప్రచురించిన పుస్తకాన్ని పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, జిల్లా సమీకృత కార్యాలయ సముదాయం ప్రారంభోత్సవం సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలో గురువారం సందడి నెలకొంది. సీఎం కేసీఆర్, మంత్రులు, ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు , పెద్ద పెద్ద కటౌట్లతో జిల్లా కేంద్రం గులాబీమయమైంది. పార్టీ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ బస్సులో వెళ్తుంటే ఆ దృశ్యాన్ని అభిమానులు, చిన్నారులు తమ ఫోన్లలో చిత్రీకరించారు. అదే విధంగా మానుకోట పట్టణంలోని మూడుకొట్ల సెంటర్, ముత్యాలమ్మగుడి సెంటర్, నెహ్రూసెంటర్, కురవి గేట్ సమీపంలో భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో తమ ఫోన్‌లలో వీడియో తీశారు.

విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన ఆర్టిజన్ జేఏసీ నేతలు

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పప్పు వెంకటేశ్వర్లు, టీఎస్ ఎన్పీడీసీఎల్ కన్వీనర్ ధారావత్ సికిందర్ అన్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల ఆర్టిజన్ జేఏసీ నాయకులు గురువారం హనుమకొండకు తరలివచ్చారు. సీఎండీ గోపాల్‌రావును కలిసి తమ సమస్యలు వివరించేందుకు ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కానీ కేవలం ఇద్దరికి మాత్రమే సీఎండీని కలిసేందుకు విజిలెన్స్ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో పప్పు వెంకటేశ్వర్లు, సికిందర్ వెళ్లి సీఎండీ గోపాల్‌రావును కలిసి సమస్యలు వివరించారు. సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒక ఆపరేటర్ మాత్రమే ఉండడంతో నెలంతా పనిచేయాల్సి వస్తోందని వాపోయారు. వెంటనే ప్రతి సబ్‌స్టేషన్‌కు కనీసం నలుగురు ఆపరేటర్లను నియమించాలని కోరారు. ఆర్టిజన్‌గా ప్రకటించిన నాటి నుంచి ప్రొహిబిషన్ పీరియడ్‌ను డిక్లేర్ చేస్తూ అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని, పీఆర్సీ ప్రకటించే ముందు విద్యుత్ శాఖలో చివరి ఉద్యోగి కనీస పేస్కేల్‌ను రూ.23.380 బేసిక్ ప్రకటించాలని, ఈపీఎఫ్‌పై ప్రస్తుతం ఉన్న రూ.15 వేల సీలింగ్ ఎత్తివేసి పూర్తి వేతనంపై ఈపీఎఫ్ ఇవ్వాలని, ఆర్టిజన్లకు తెలంగాణ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, పరిమితి లేని వైద్య సదుపాయం కల్పించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. స్పందించిన సీఎండీ ఆర్టిజన్ల సమస్యలను ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆర్టిజన్ జేఏసీ నాయకులు తెలిపారు. ఆయా జిల్లాల జేఏసీ నాయకులు బాబన్న, భూపాల్, కోటిగౌడ్, మారుతి, సలీంపాషా, మంద వీరన్న, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్టిజన్ జేఏసీ నాయకులు

పండుగకు పుట్టింటికి వస్తూ..

- ఆర్టీసీ బస్సును ఇసుక లారీ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి
- ములుగు జిల్లాలో ప్రమాదం



బస్సులోనే మృతి చెందిన తేజస్విని



ప్రమాద స్థలిలో ఆర్టీసీ బస్సు, లారీ

మంగపేట: పండుగకు పుట్టింటికి వస్తుండగా ఆర్టీసీ బస్సును ఇసుక లారీ ఢీకొట్టిన ఘటనలో మహిళ మృతి చెందింది. ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట – బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య కొత్తచీపురుదుబ్బ రోడ్డుకు సమీపంలో ఏటూరునాగారం–బూర్గంపాడు రహదారిపై గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వాజేడు మండలం పూసూరు గ్రామానికి చెందిన కల్వకొలను తేజస్విని(27)కి ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురానికి చెందిన వెంకటరామారావుతో గత మే నెలలో వివాహం జరిగింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో తేజస్విని పుట్టింటికి రావాలనుకుంది. ఈ మేరకు అమలాపురం నుంచి మణుగూరు చేరుకుని.. అక్కడి నుంచి ఏటూరునాగారం వచ్చేందుకు వైజాగ్ నుంచి హనుమకొండకు వచ్చే ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యలో బ్రాహ్మణపల్లి – రాజుపేట గ్రామాల మధ్య గల మూలమలుపు వద్ద మంగపేట నుంచి మణుగూరు వైపు వెళ్తున్న లారీ బస్సును వేగంగా ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న తేజస్విని తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్ రమేష్‌తో పాటు రెండో డ్రైవర్ రబ్బానికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఎస్సై రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా అనంతరం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రాణనష్టం..

ఆర్టీసీ బస్సు డ్రైవర్ రమేష్ సమయ స్ఫూర్తితో భారీ ప్రాణనష్టం తప్పినట్లు ప్రమాద స్థలాన్ని చూస్తే తెలుస్తుంది. ప్రమాదాన్ని ముందే గ్రహించి డ్రైవర్ బస్సును కుడివైపు రోడ్డు దించేందుకు ప్రయత్నించాడు. అప్పటికే లారీ వచ్చి ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఆ సమయంలో బస్సులో 25 మంది ప్రయాణికులు ఉన్నారు. కాగా, పండుగకు వస్తూ తేజస్విని తిరిగిరాని లోకానికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గోవులకు సేవ చేయడం అదృష్టం

- రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రావు

హన్మకొండ: గోవులకు సేవ చేసే అవకాశం లభించడం గోపాలమిత్రల అదృష్టమని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు అన్నారు. వరంగల్‌లోని ఉమ్మడి వరంగల్ జిల్లా సంస్థ కార్యాలయ ఆవరణలో నెలకొల్పిన గోపాలకృష్ణుడి విగ్రహాన్ని వరంగల్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చింతకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం ఆవిష్కరించారు. అనంతరం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ గోపాలకృష్ణుడి పేరుతో గోపాలమిత్ర ఉండడం సంతోషకరమని, గోపాలమిత్రలు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మేలు జాతి దూడల ఉత్పత్తికి సంస్థ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉత్తమ గోపాలమిత్రలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాస్, హనుమకొండ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ, వరంగల్ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ రఘుబాబు, డాక్టర్ కృష్ణ, ఆనంద్, ప్రభు, ఉపేందర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, దేవేందర్ రావు, రత్నాకర్, సమ్మయ్య, రాధ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్‌రావు

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం రద్దు

- ప్రకటించిన ఎండోమెంట్ ఆర్‌జేసీ రామకృష్ణారావు, ఏసీ సునీత
- ఐనవోలు ఆలయంలో నాటకీయ పరిణామాలు
- సభ్యులను సన్మానించి తెరదించిన డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం అధికారికంగా రద్దయింది. గురువారం ఉదయం నుంచి ఆలయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. జీఓ నంబర్ 11 ద్వారా వంశపారంపర్యం కానటువంటి ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఈ నెల 10న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సభ్యులు గురువారం మధ్యాహ్నం 3గంటలను ముహూర్తంగా నిర్ణయించుకున్నారు. అంతలోనే ప్రభుత్వ జీఓను హైకోర్టు బుధవారం సస్పెండ్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఓ పక్క ఈ చర్చ జరుగుతుండగానే ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత చేరుకున్నారు. ప్రమాణ స్వీకారం చేయించడం కుదరదని కమిటీ సభ్యులతో చెప్పారు. ఎందుకని వారు ప్రశ్నించడంతో హైకోర్టులో పిటిషన్ ఉందని, ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు ప్రమాణ స్వీకారాన్ని రద్దు చేసినట్లు ఆమె చెప్పారు. అదే సమయంలో భద్రాచలం వెళ్తున్న ఆర్‌జేసీ రామకృష్ణారావు మల్లన్న దర్శనానికి వచ్చారు. ఎండోమెంట్ కమిషనర్‌తో మాట్లాడిన తర్వాత ప్రమాణ స్వీకారాన్ని రద్దు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. జీఓ 11ను సవాల్ చేస్తూ హైకోర్టులో కేసు ఉందని, దానిపై స్పష్టత వచ్చే వరకు ప్రమాణస్వీకారం చేయించడం కుదరని తేల్చిచెప్పారు. అధికార పార్టీ ముఖ్య నాయకులు స్థానిక ఎమ్మెల్యేతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడి ఎలాగైనా ప్రమాణ స్వీకారం చేయించాలని పట్టుబట్టారు. దీంతో ఎమ్మెల్యే సూచన మేరకు హనుమకొండ నుంచి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మధుమతి ఆలయానికి చేరుకున్నారు. కమిటీ సభ్యులతో ఆలయంలో దర్శనం చేయించి కండువాలు కప్పారు. దీంతో ఉదయం నుంచి జరుగుతున్న నాటకీయ పరిణామాలకు తెరతీసినట్లయింది. అధికార పార్టీ నాయకులు ఆలయ పాత చైర్మన్ చాంబర్‌లో ప్రతిపాదిత సభ్యుల్ని కూర్చోబెట్టినట్లు సమాచారం. అయితే ఎండోమెంట్ అధికారులు సన్మాన కార్యక్రమానికి దూరంగా ఉండగా అధికార పార్టీ పోకడలను పలువురు మల్లన్న భక్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.



డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో ప్రతిపాదిత ట్రస్టు బోర్డు కమిటీ సభ్యులు

క్లుప్తంగా

నియామకం



నర్సంపేట : నర్సంపేటలోని 20వ వార్డు మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని గురువారం నియమించారు. అధ్యక్షుడిగా పాలాయి చిన్నకొమురయ్య, ఉపాధ్యక్షులుగా నూనె శ్రీనివాస్, బండి ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పోశాల రాంబాబు, జాయింట్ సెక్రటరీలుగా మెదరమెట్ల వెంకటేశ్వర్లు, తాటికొండ వెంకటేశ్వర్లు, సెక్రటరీలుగా రౌతు మహేందర్, తాటికొండ కుమారస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోశాల రాజు, పాలాయి కిరణ్, కోశాధికారిగా పుప్పాల రాజన్న, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

18నుంచి 'కంటి వెలుగు'

నర్సంపేట రూరల్ : ఈనెల 18నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని సీపీఓ, మండల స్పెషలాఫీసర్ జీవరత్నం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతె కళావతి పద్మనాభరెడ్డి, ఎంపీడీవో ఇంద్రసేనారెడ్డి, ఎంపీఓ సునీల్‌కుమార్ రాజ్, భాంజీపేట, చెన్నారావుపేట వైద్యాధికారులు అరుణ్‌చంద్ర, సరోజన, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష

దుగ్గొండి : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కాట్ల కోమల మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం అందించే నిధులను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సన్మానం

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రేను గురువారం హైదరాబాద్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా నియమితులైన మాణిక్‌రావ్ ఠాక్రేను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేపట్టిన, చేపడుతున్న కార్యక్రమాలను వివరించడం జరిగిందన్నారు.

రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు

సంగెం : పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని మార్చాలని పలువురు మాజీ ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. మాజీ ఎంపీపీలు కక్కెర్ల సదానందం, బొమ్మాల కట్టయ్యల నేతృత్వంలో రేవంత్‌రెడ్డిని పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందాడి లక్ష్మారెడ్డి, గుండేటి ఎల్లయ్య, వేల్పుల బాబు, గుండేటి ఏలియా, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి



ఖానాపురం : రైతులు సాగు చేస్తున్న పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణ కోసం వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మండలంలోని ఐనపల్లిలో ఆయిల్‌పామ్ పంటతో పాటు ఇతర పలు పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా మిరప, పెసర, వేరుశనగలాంటి స్వల్పకాలిక ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వర్ధన్నపేట : తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో గురువారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట హెచ్‌ఎం సురేందర్, ఇల్లంద హెచ్‌ఎం మునగాల విజయ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..



నర్సంపేట : ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సిద్ధార్థ కళాశాలలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ క్యాలెండర్‌ను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్, విద్యా సంస్థల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాత్రి అనిల్, జిల్లా కమిటీ సభ్యులు ప్రశాంత్, రాకేష్, మహేష్, అక్షయ, అక్షిత, తరుణ్, కిరణ్ పాల్గొన్నారు.

చల్లంగా చూడు.. చెన్నకేశవా

- నేటి నుంచి మూడు రోజులపాటు జాతర
- మొక్కులు చెల్లించుకోనున్న భక్తులు





విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం (ఇన్‌సెట్‌లో) శ్రీచెన్నకేశవ స్వామి మూలవిరాట్

చెన్నారావుపేట : కొలిచిన వారికి కొంగు బంగారంగా.. శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి జాతర మండలంలోని లింగగిరి గ్రామంలో వైభవోపేతంగా నేడు ప్రారంభం కానుంది. గుట్టపై ఏర్పాటు చేసిన హనుమంతుడి విగ్రహం భక్తులను ఆకట్టుకోనుంది. గ్రామంలోని గుట్టపై జరిగే జాతరకు భక్తులు వేల సంఖ్యలో హాజరుకానున్నారు.

శ్రీదేవి, భూదేవిల సమేతంగా వెలిసిన స్వామి వారికి ప్రతి సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు సముద్రాల సుందరయ్యాచారి తెలిపారు. ప్రతి ఏటా డిసెంబర్ 15నుంచి జనవరి 15వరకు నెల రోజుల పాటు స్వామి వారికి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. స్వామి ఎదుట ఉన్న గద్దెలకు ముడుపులు చెల్లిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

జాతర వివరాలు..

నేడు (శుక్రవారం) ఆలయ వార్షికోత్సవం, గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామి అభిషేకం, మహోత్సవం, మహాదాశీర్వచనం నిర్వహిస్తారు. 14వ తేదీ శనివారం భోగి పండుగను పురస్కరించుకొని గోదాదేవి కల్యాణ వేడుకలను నిర్వహిస్తారు. 15న ఆదివారం సంక్రాంతి పర్వదినం పురస్కరించుకని మహా జాతర నిర్వహిస్తారు. భక్తులు ప్రభబండ్లు, నృత్య ప్రదర్శనలు, కోలాటాలతో వివిధ రీతులుగా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. 16న సోమవారం రోజున కనుమ రోజు స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

శ్రీచెన్నకేశవస్వామి మహాజాతరను పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ మాదారపు భాస్కర్, ఎంపీటీసీ పరకాల లక్ష్మిరాజన్న, ఉపసర్పంచ్ రాజశేఖర్‌గౌడ్‌లు తెలిపారు.

భారీ బందోబస్తు: ఎస్సై తోట మహేందర్

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని లింగగిరి గ్రామంలో జరిగే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశాము.

త్రీఫేజ్ విద్యుత్ అందించాలని నిరసన



నర్సంపేట రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నర్సంపేట రూరల్ : పంటలకు నీటిని అందించేందుకు నాణ్యమైన త్రీఫేజ్ కరెంట్ లేకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. తక్షణమే నాణ్యమైన విద్యుత్ అందించాలని నర్సింగాపురం రైతులు ఈర్ల పైడి, గొర్రె మొగిలి, లింగదారి శంకర్, నర్సింహాస్వామిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సక్రమంగా విద్యుత్ రావడంలేదని ట్రాన్స్‌ఫార్మర్‌కు డిమాండ్ చేస్తూ అక్కడే నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ ప్రసారం కావడంతో ఐదు నుంచి ఆరు గంటల కరెంట్ మాత్రమే వస్తోందన్నారు. అందులో లోవోల్టేజీ సమస్య రావడంతో నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు గొర్రె రాజు, లింగదారి విజేందర్, వేముల రమేష్, తాత రజిని కుమార్, అడ్డగట్ల శ్రీధర్, వాంకుడోత్ నర్సయ్య, రాజు, కేశవైనా నరేష్, వాంకుడోదు నర్సయ్య, రాజు, కేశనైనా నరేష్, వాడుకూరి శంకర్, గొర్రె రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంఎదుట రైతుల ఆందోళన

వర్ధన్నపేట : పదిహేను రోజులుగా తమ వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండి పోతున్నాయని గురువారం వర్ధన్నపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలో రైతులు ఆందోళనకు దిగారు. వర్ధన్నపేట డివిజన్ పరిధిలోని ఇల్లంద, కుమ్మరిగూడెం, నల్లబెల్లి గ్రామాలకు వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా కావడం లేదని వాపోయారు. అధికారులు స్పందించకపోవడంతో కార్యాలయం వద్దకు రావాల్సి వచ్చిందన్నారు. ఓ విద్యుత్ శాఖ అధికారి నోటి దురుసుగా మాట్లాడుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోమని వ్యవహరించడంతో తమను వ్యంగంగా మాట్లాడడం బాధకరమని వారు అన్నారు.

సీఎం కేసీఆర్‌కు స్వాగతం



మహబూబాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, జిల్లా గ్రంథాలయం, బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవానికి గురువారం విచ్చేసిన సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి.

జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం



దుగ్గొండి: క్రీడలను ప్రారంభిస్తున్న బాధ్యులు

దుగ్గొండి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని నాచినపల్లి గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలను గురువారం సర్పంచ్ పెండ్యాల మమత ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ క్రీడలకు గాను దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట మండలాల నుంచి వందల సంఖ్యలో క్రీడాకారులు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల కృష్ణారెడ్డి, బోళ్ల సాంబయ్య, రాజిరెడ్డి, పుచ్చకాయల నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎలేందర్‌రెడ్డి, బత్తిని స్వామి, బోళ్ల శ్రీకాంత్, రమేష్, క్రీడాకారులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

రాయపర్తి : క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసంతోపాటు నాయకత్వపు లక్షణాలు పెంపొందుతాయని ఎస్సై బండారి రాజు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఆల్‌స్టార్ ఆధ్వర్యంలో తలపెట్టిన క్రికెట్ టోర్నిని ఆయన ప్రారంభించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

నెక్కొండ : దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని నెక్కొండ హైస్కూల్ హెచ్‌ఎం రంగారావు గురువారం తెలిపారు. ఈ నెల 26నుంచి 31 వరకు కేరళ రాష్ట్రంలోని త్రిస్సూర్‌లో జరిగే దక్షిణ భారతదేశ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. విద్యార్థులకు గణితంలో చక్కటి తర్ఫీదునిచ్చిన గైడ్ టీచర్ బండారి రమేష్‌తో పాటు విద్యార్థులను ఎంపీపీ జాటోత్ రమేష్‌నాయక్, సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి, పలువురు అభినందించారు.

జాతీయ సైన్స్‌ఫెయిర్‌కు ఆల్ఫోర్స్ విద్యార్థులు

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని ఆల్ఫోర్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. వీరిని డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

రక్తదాన శిబిరం



సంగెం : జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో యువసంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గురువారం నిర్వహించిన శిబిరంలో తమ స్నేహితుడు బోనాల ప్రవీణ్ జ్ఞాపకార్థం 28 మంది దాతలు రక్తదానం చేశారు. ఎంపీపీ కళావతి, సంస్థ వ్యవస్థాపకుడు బొమ్మాల శంకర్, మండల పరమేష్, ఉపాధ్యక్షుడు మండల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షురాలు మేదరి భవాని, కార్యదర్శి గాలి అన్వేష్, చింతల రాజు, ఇమ్మడి సుమన్, సీసీ సురేష్, కుమార్, డాక్టర్ అషాదేవి, కళ్యాణి పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దు



మాట్లాడుతున్న జాటోత్ ఆమ్యా నాయక్

రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని రాబోయే రోజులు కాంగ్రెస్‌వేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ ఆమ్యా నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ధీటైన నాయకుడు రాబోతున్నారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్రకు మద్దతుగా ఈనెల 26న ప్రతి గ్రామంలో జెండా ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో తొర్రూరు మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మేకల కుమార్, నాయకులు కుందూరు విక్రమ్ రెడ్డి, సరికొండ కష్టారెడ్డి, పెండ్లి మహేందర్ రెడ్డి, కష్టమాచార్యులు, కుంట రమేష్, నీలయ్య, కుమారస్వామి, ఉల్లెంగల యాదగిరి, చిర్ర మల్లయ్య, శ్రీనివాస్ మద్దెల వెంకటేష్ , సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. వివేకానందుడు



ఖానాపురం: కొత్తూరులో..



దుగ్గొండి: మండల కేంద్రంలో..



నల్లబెల్లిలో..

స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు ఆదర్శమని పలువురు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా గురువారం వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వివేకానందుడు అపూర్వ ప్రజ్ఞావంతుడన్నారు. యువత లే.. మేలుకో.. లక్ష్యం చేరేదాక విశ్రమించకు అని వెన్నుతట్టి యూత్‌ను ప్రోత్సహించారన్నారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ యువజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చెన్నారావుపేట: వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు, యువకులు



నర్సంపేట: నివాళులర్పిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి



వర్ధన్నపేట: నివాళులర్పిస్తున్న నిర్వాహకులు



రాయపర్తిలో..

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అన్నమనేని అప్పారావు

వర్ధన్నపేట : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ అన్నమనేని అప్పారావు అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు, నీటి సరఫరా సమస్యలపై ఆయా గ్రామాల ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకురాగా ఆయా శాఖల అధికారులతో ఎంపీపీ మాట్లాడి ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో నల్లబెల్లి, కుమ్మరిగూడెం, ఇల్లంద గ్రామాల్లో గత 15 రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడితే రైతులు ఈ విషయంపై కార్యాలయానికి వచ్చి ప్రశ్నిస్తే దురుసుగా అధికారులు ప్రవర్తించారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు విద్యుత్ డీఈ సమాధానం ఇస్తూ విద్యుత్ సరఫరాలో అంతరాయం నిజమేనని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సదారాజ్, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలి



నర్సంపేట: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పర్వతగిరి: విజ్ఞాన భారతిలో..



సంగెం: మొండ్రాయిలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

నర్సంపేట : సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని డాక్టర్ మోతె నవత అన్నారు. ఈ మేరకు భారత జాతీయ సమైక్య(ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో పట్టణంలోని మాధన్నపేటరోడ్డు సీపీఐ కాలనీలో సంక్రాంతి సంబరాల సందర్భంగా గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

అక్షర ద స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

నర్సంపేట పట్టణంలోని అక్షర ద స్కూల్, బిట్స్ స్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బొమ్మల కొలువు, ముగ్గుల పోటీ, గాలి పటాలు ఎగురవేసే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

సిద్దార్థలో రంగోళి పోటీలు

నర్సంపేటలోని సిద్దార్థ కళాశాలలో జాతీయ సేవాపథకం విభాగం ఆధ్వర్యంలో గురువారం వలంటీర్లకు ఆడపిల్లను రక్షిద్దాం అనే అంశంపై రంగోళి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, విద్యాభారతి హైస్కూల్, మొండ్రాయిలోగల సిద్ధార్థ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గుల పోటీలు, కైట్ ఫెస్టివల్ నిర్వహించారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ విజ్ఞాన భారతి విద్యాలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని శ్రీ మహాత్మా హైస్కూల్‌లో సంక్రాంతి ముందస్తు సంబరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి భోగి మంటలు ఏర్పాటు చేసి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిబాఫాల్, హెచ్‌ఎం సోమన్న, డైరెక్టర్ సంతోష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సాంబయ్య,రవీందర్, శంకర్, పర్వీన్, అనిత,జయశ్రీ, మౌనిక, సౌమ్య, దీపిక, రాజేశ్వరీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులతో సంక్రాంతి శోభ

చెన్నారావుపేట : ముగ్గులతోనే సంక్రాంతి పర్వదిన శోభ వస్తుందని సర్పంచ్ అనుముల కుమారస్వామి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పాఠశాలలోని ఉపాధ్యాయులు ముగ్గుల పోటీ నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఉమా శంకర్, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్, స్కూల్ చైర్మన్ మేడిద లక్ష్మణ్, మండల సమైక్య అధ్యక్షురాలు కదూరి హైమ, నల్ల రవి, రోజా, పుష్ప, సీఆర్పీ కందిక శిల్ప, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట: బహుమతి అందిస్తున్న సర్పంచ్



నర్సంపేటలో.. రాజేంద్రప్రసాద్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

ముందస్తు అరెస్టు సరికాదు

చెన్నారావుపేట : సీఎం కేసీఆర్ మహబూబాబాద్ పర్యటన నేపథ్యంలో స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ అన్నారు.

నల్లబెల్లి : సీఎం కేసీఆర్ మహబూబాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కాంగ్రెస్ నాయకులను గురువారం ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్సై నార్లాపురం రాజారాం తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ తదితరులు ఉన్నారు.

ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోవాలి

పర్వతగిరి : ఎస్సీ, ఎస్టీలు 101యూనిట్ల వరకు అందించే ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోవాలని ఏడీ చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కైట్స్ డే

నర్సంపేట : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని విజ్‌డమ్‌ఫ్రీ స్కూల్‌లో గురువారం కైట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు చిన్నారులు అందంగా అలంకరించుకొని రంగు రంగుల పతంగులను ఆకాశంలో ఎగురవేస్తూ నృత్యాలు చేశారు.

ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

నల్లబెల్లి : ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని శనిగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపాడు.

గీతకార్మికుడికి ఆర్థికసాయం

సంగెం : మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బొమ్మ సదానందం ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్ గురువారం పరామర్శించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మోకు దెబ్బ నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ 15వేల చెక్కును బాధితుడికి అందజేశారు.

స్థలం కేటాయించాలి

నర్సంపేట : నర్సంపేట పట్టణంలో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటుకు స్థలంతో పాటు పర్మిషన్ ఇవ్వాలని నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు.

నూతన చైర్మన్‌గా బాలరాజు

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి దూడల మల్లన్న దేవస్థానం నూతన చైర్మన్‌గా బెల్లం బాలరాజు నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం బెల్లం బాలరాజుతో పాటు డైరెక్టర్లతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఐరన్, సిమెంట్ హమాలీ రేట్ల పెంపు

నర్సంపేట : నర్సంపేటలోని ఐరన్, సిమెంట్ షాపుల్లో పని చేస్తున్న హమాలీల కూలిరేట్ల గడువు ముగియడంతో నూతన రేట్ల ఒప్పందం కోసం వ్యాపార ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో గురువారం జరిగిన చర్చలు సఫలమయ్యాయని కార్మిక సంఘం నాయకులు ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, హమాలీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణలు తెలిపారు.

చెక్కుల అందజేత

గీసుకొండ /సంగెం : సీఎం సహాయ నిధితో ఆపన్నులకు మేలు జరుగుతోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హన్మకొండలోని తన నివాసంలో గ్రేటర్ వరంగల్ నగరం, సంగెం, గీసుకొండ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు.

చేయూత

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారు హర్యనాయక్ తండాకు చెందిన లావుడ్య దేవ్ సింగ్‌కి చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధమైంది. కుల పెద్దమనుషులు, తండావాసులు ఏకమై చందాల రూపంలో రూ.26 వేలు వసూలు చేసి గురువారం బాధిత కుటుంబానికి అందించారు.

యువర్స్

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...
* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటో గ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్టుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్

● మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.

● పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!

●గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.



■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్

డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..



డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియొనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియొనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



"వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు" అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

● చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.

● బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.

● ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.

● ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతిహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.